సాక్షి ఏలూరు

ఆదివారం । 17 । మార్చి । 2024



టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 8లో ▸



లోక్ అదాలత్‌లో రాజీ

కోర్టు కేసుల నుంచి విముక్తి పొందటానికి జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు వేదిక అని రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి అన్నారు. 8లో ▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
ఏలూరు	6.21	4.47
భీమవరం	6.20	4.51

న్యూస్‌రీల్

పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులు



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులని, ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు రాగాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అన్నారు. జేసీ లావణ్య వేణి మాట్లాడుతు స్వాతంత్ర్య ఉద్యమంలో పొట్టి శ్రీరాములు గాంధీ మార్గంలో నడిచి పలు ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో డి.పుష్పమణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, డీఎంహెచ్‌ఓ ఎస్.శర్మిష్ఠ, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం.పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆర్.నాగరాణి, డ్వామా పి.రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఘంటా సుధాకర్ పాల్గొన్నారు.

'పశ్చిమ'లో ఘన నివాళులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన స్ఫూర్తిగా ముందుకు సాగాలని సూచించారు. డీఆర్వో జె.ఉదయ భాస్కరరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ కానాల సంగీత్ మాధుర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు, డీఈఓ ఆర్.వెంకట రమణ, డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల నియమావళి (కోడ్) అమలులోకి వచ్చిందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించగా ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అధికారులు వర్చువల్‌గా వీక్షించారు. వచ్చేనెల 18న నోటిఫికేషన్ విడుదల, 25న నామినేషన్ల సమర్పణకు చివరి తేదీ, 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా తెలిపారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ బి.లావణ్యవేణి, ఐటీడీఏ పీఓ ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్వో డి.పుష్పమణి పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. శనివారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి సార్వత్రిక ఎన్నికలు, గ్రూప్-1 పరీక్షలు, జనన మరణ నమోదు చట్టం తదితర అంశాలపై సీఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్య వేణి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో గ్రూపు-1 పరీక్షల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఏర్పాట్లను వివరించారు. సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతున్న జిల్లాలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, రాజకీయ నాయకుల పోస్టర్లు, హోర్డింగులు, కటౌట్లు తొలగించాలన్నారు.

ఏలూరు పార్లమెంట్ స్థానం



కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్
- పుట్టిన తేదీ : 02-10-1990
- విద్యార్హత : లండన్‌లో గ్రాడ్యుయేషన్
- కులం : బీసీ (యాదవ)
- భార్య : కీర్తి వల్లూరు
- సంతానం : శ్రీ అథర్వవీర్

ఏలూరు అసెంబ్లీ



ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)
- పుట్టినతేదీ : 30-12-1969
- విద్యార్హత : బీకాం
- కులం : కాపు
- భార్య : ఫణిరేఖ
- సంతానం : కాళీకృష్ణ మణిచంద్ర, ఆశిష్

గోపాలపురం అసెంబ్లీ




తానేటి వనిత
- పుట్టినతేదీ : 24-06-1974
- విద్యార్హత : ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ
- కులం : ఎస్సీ (మాదిగ)
- భర్త : శ్రీనివాసరావు
- సంతానం : ప్రణవి

దెందులూరు అసెంబ్లీ



కొఠారు అబ్బయ్యచౌదరి
- పుట్టినతేదీ : 22-12-1981
- విద్యార్హత : బీటెక్
- కులం : కమ్మ
- భార్య : అనురాధ
- సంతానం : ఆశ్రీత, ఆకాష్

కైకలూరు అసెంబ్లీ



దూలం నాగేశ్వరరావు
- పుట్టినతేదీ : 09-07-1967
- విద్యార్హత : 7వ తరగతి
- కులం : కాపు
- భార్య : వీరాకుమారి
- సంతానం : వినయ్ కుమార్, శ్యామ్ ఫణికుమార్

నూజివీడు అసెంబ్లీ



మేకా వెంకట ప్రతాప అప్పారావు
- పుట్టినతేదీ : 11-08-1953
- విద్యార్హత : బీకాం
- కులం : వెలమ
- భార్య : సుజాత (లేటు), రాధిక
- సంతానం : వేణుగోపాల్ అప్పారావు

ఉంగుటూరు అసెంబ్లీ



పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు)
- పుట్టినతేదీ : 31-12-1967
- విద్యార్హత : డిగ్రీ
- కులం : కాపు
- భార్య : రమణి
- సంతానం : స్నిగ్ధ, ప్రజ్ఞ

పోలవరం అసెంబ్లీ



తెల్లం రాజ్యలక్ష్మి
- పుట్టినతేదీ : 03-05-1976
- విద్యార్హత : బీఏ, డీఈడీ
- కులం : ఎస్టీ
- భర్త : తెల్లం బాలరాజు
- సంతానం : సాయి విశాల్, రోహిత్

చింతలపూడి అసెంబ్లీ



కంభం విజయరాజు
- పుట్టినతేదీ : 27-07-1963
- విద్యార్హత : బీఏ, ఎల్ఎల్‌బీ
- కులం : ఎస్సీ (మాల)
- భార్య : నీరజ శ్రీలత
- సంతానం : షైనీ ప్రత్యూష, షైలీ ప్రదీప్తి, శామ్యూల్ ప్రదీప్ గౌతమ్, శామ్యూల్ ప్రణయ్ తేజ

బరిలోకి గెలుపు గుర్రాలు

విజయోస్తు
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల జాబితా ప్రకటన
- సామాజిక సమీకరణలకు పెద్దపీట
- రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ బీసీలకు అవకాశం
- ఐదుగురు కొత్తవారికి చాన్స్
- మరోసారి బరిలో మంత్రులు కొట్టు, కారుమూరి
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం



సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రానున్న సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచే వైఎస్సార్ సీపీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాను శనివారం ప్రకటించారు. రెండు జిల్లాల్లో ఐదుగురు కొత్తవారికి అవకాశం ఇవ్వగా మిగిలిన స్థానాలను సిట్టింగులకు కేటాయించారు. గోదావరి జిల్లాల నేపథ్యానికి అనుగుణంగా సామాజిక సమీకరణల దృష్ట్యా అభ్యర్థులను ఎంపిక చేశారు. అన్ని సామాజిక వర్గాలకు పెద్దపీట వేయడంతోపాటు విద్యావంతులకు పార్లమెంట్ స్థానాల్లో అవకాశం ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతుంది. సీనియర్ నేతలందరికీ యథాతథంగా సిట్టింగ్ స్థానాలనే కేటాయించారు.

ముగ్గురు మహిళలకు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురు మహిళలకు అవకాశం లభించడం విశేషం. ప్రతిపక్ష కూటమి నుంచి ఒక్కస్థానం కూడా కేటాయించని పరిస్థితిలో వైఎస్సార్‌సీపీ మూడు స్థానాలు ఇవ్వడంపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రస్తుతం మంత్రులుగా ఉన్న కొట్టు సత్యనారాయణ, కారుమూరి వెంకట నాగేశ్వరరావు, మాజీ మంత్రులుగా ఉన్న ఆళ్ల నాని, చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, అలాగే భీమవరంలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను ఓడించి సంచలన విజయం సాధించిన విప్ గ్రంధి శ్రీనివాస్ సిట్టింగుల స్థానాల నుంచే మళ్లీ బరిలో నిలిచారు.

బీసీలకు తొలి అవకాశం : ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాలను తొలిసారిగా బీసీలకు కేటాయించారు. యాదవ సామాజికవర్గానికి చెందిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు ఏలూరు ఎంపీ అభ్యర్థిగా అవకాశం దక్కింది. లండన్‌లో గ్రాడ్యుయేషన్, అమెరికాలో ప్రత్యేక కోర్సులు పూర్తి చేసి కారుమూరి సేవా సమితి పేరుతో ఆయన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే న్యాయవాది, శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన గూడూరి ఉమాబాల నరసాపురం ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. భీమవరానికి చెందిన ఉమాబాల ఉన్నత విద్యావంతురాలు. 1995 నుంచి ఆమె రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. ఈ రెండు పార్లమెంట్ స్థానాల చరిత్రలో తొలిసారి బీసీ అభ్యర్థులు బరిలో నిలిచారు.

సామాజిక సమీకరణల దృష్ట్యా.. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సామాజిక సమీకరణలకు అనుగుణంగా, పార్టీ సీనియార్టీ ప్రధానంగా సీట్ల కేటాయింపు జరిగింది. సామాజికవర్గాల వారీగా కాపులకు 5, క్షత్రియులకు 3, బీసీలకు 2, ఎస్సీలకు 1, ఎస్టీలకు 1, వెలమకు 1, కమ్మకు 1 స్థానం కేటాయించారు. రెండు పార్లమెంట్ స్థానాలను బీసీల్లోని యాదవ, శెట్టిబలిజలకు కేటాయించారు.

రాజకీయాల్లో ఉద్దండులు : ఉమ్మడి జిల్లాలో మూడు దశాబ్దాలుగా క్రియాశీలక రాజకీయాల్లో ఉంటూ చక్రం తిప్పిన సీనియర్ నేతలు, సిట్టింగ్‌లు అత్యధికులకు మళ్లీ అవకాశం దక్కింది. శాసనసభ నియోజకవర్గాల వారీగా 1994 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న ఆళ్ల నాని ఏలూరు నుంచి, 1999 నుంచి ప్రజాక్షేత్రంలో ఉన్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నూజివీడు నుంచి, 2006 నుంచి రాజకీయాల్లో ఉన్న దూలం నాగేశ్వరరావు కైకలూరు నుంచి, 2006 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉన్న పుప్పాల వాసుబాబు ఉంగుటూరు నుంచి, 2002 నుంచి రాజకీయాల్లో ఉన్న ముదునూరు ప్రసాదరాజు నరసాపురం నుంచి, 2004లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి జిల్లాలో కీలక నేతగా ఉన్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆచంట నుంచి, 1994లో రాజకీయాల్లోకి వచ్చి క్రియాశీలకంగా కొనసాగుతున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తాడేపల్లిగూడెం నుంచి, 2004లో జెడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం చేసిన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మళ్లీ తణుకు నుంచి, డీసీసీబీ డైరెక్టర్‌గా, చైర్మన్‌గా సుదీర్ఘంగా రాజకీయాల్లో ఉన్న పీవీఎల్ నర్సింహరాజు మళ్లీ ఉండి నుంచి, 2018 నుంచి క్రియాశీలక రాజకీయాల్లో ఉంటూ ఎమ్మెల్యేగా గెలిచిన కొఠారు అబ్బయ్యచౌదరి మళ్లీ దెందులూరు నుంచి బరిలో నిలిచారు.

ఐదుగురు కొత్తవారికి..

ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాల పరిధిలో ఐదుగురు కొత్తవారికి వైఎస్సార్‌సీపీ అవకాశం కల్పించింది. అది కూడా సామాన్యులకు దక్కటం విశేషం. ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్, నరసాపురం ఎంపీ అభ్యర్థి ఉమాబాల, చింతలపూడి అసెంబ్లీ అభ్యర్థి రిటైర్డ్ రవాణా శాఖ అధికారి విజయరాజు, పోలవరం అసెంబ్లీ అభ్యర్థి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన రాజ్యలక్ష్మి, పాలకొల్లు అసెంబ్లీ అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) తొలిసారి ఎన్నికల బరిలో ఉన్నారు.

అన్ని స్థానాలూ గెలుస్తాం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర: జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా ఇస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శనివారం మాముడూరులో ఎన్నికల ప్రచార యాత్రలో భాగంగా లాకుపాలెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి తిరిగి ఆచంట అసెంబ్లీ స్థానాన్ని కేటాయించినందుకు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌పై రాష్ట్ర ప్రజలకు పూర్తి విశ్వాసం, నమ్మకం ఉందని, 175 అసెంబ్లీ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, పేదల సంక్షేమానికి భరోసా ఇచ్చిన సీఎం జగన్‌పై ప్రజలందరికీ విశ్వాసం ఉందన్నారు. టీడీపీ కారణంగా ఆచంట నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, తాము అభివృద్ధి చేస్తుంటే టీడీపీ నాయకులు ఓర్వలేక అడ్డుతగులుతున్నారని, పేదలకు పట్టాలు ఇస్తుంటే కుల వైషమ్యాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. త్వరలో రాష్ట్ర ప్రజలు టీడీపీని పూర్తిగా తరిమికొడతారని అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీ సుభాషిణి, మండల పార్టీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు పాల్గొన్నారు.

గూడెం సీటును గెలిచి గిఫ్టుగా ఇద్దాం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



విలేకరులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో తాడేపల్లిగూడెం సీటును కేటాయించారని, ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ, గౌరవాన్ని నిలబెట్టుకుంటూ భారీ మెజార్టీతో గెలిచి తాడేపల్లిగూడెం సీటును సీఎం జగన్‌కు గిఫ్టుగా ఇద్దామని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం నందమూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంపై, తనపై, కార్యకర్తలు, అభిమానులపై గౌరవంతో బాధ్యతను ఉంచి మళ్లీ టికెట్ కేటాయించారన్నారు. ఇది శుభ పరిణామమని, ఐకమత్యంగా పనిచేసి విజయం సాధిద్దామన్నారు. అందరం మళ్లీ గర్వంగా తలెత్తుకొని తిరగాలంటే వైఎస్సార్‌సీపీ గెలిచి మరలా జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఈ విషయం గడపగడపకు వెళ్లినప్పుడు ప్రజలు ఆనందంగా చెబుతున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీ శ్రేణులు ముందుకు సాగాలన్నారు. కాపు సామాజికవర్గం అధికంగా ఉన్న గోదావరి జిల్లాల్లో తనపై గౌరవంతో సీఎం జగన్ ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారన్నారు. రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు అందరం సమైక్యంగా ప్రజలు వద్దకు వెళదామని పిలుపునిచ్చారు. సీఎం జగన్ పాలనపై ప్రజలంతా ఆకర్షితులయ్యారన్నారు.

ఎన్నికల నగారా

- ఉమ్మడి జిల్లాలో కోడ్ అమలు
- వచ్చేనెల 18న నోటిఫికేషన్
- మే 13న పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్





ఏలూరు జెడ్పీ కార్యాలయంలో విగ్రహాలకు ముసుగు వేసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఎన్నికల నగారా మోగింది. రాష్ట్రంలోని పార్లమెంట్, అసెంబ్లీ స్థానాల ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో శనివారం నుంచి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కోడ్ అమలులోకి వచ్చింది. ఇదిలా ఉండగా ఇప్పటికే రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. అధికార వైఎస్సార్‌సీపీ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల ప్రచారంలో దూసుకువెళ్తుండగా టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కూటమి 14 అసెంబ్లీ స్థానాలకు 12 ప్రకటించి కైకలూరు, పోలవరం అసెంబ్లీ స్థానాలు, ఏలూరు, నరసాపురం పార్లమెంట్ స్థానాల అభ్యర్థులను పెండింగ్‌లో ఉంచింది. రెండు జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, సుమిత్‌కుమార్ గాంధీ ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు వచ్చే నెల 18న నోటిఫికేషన్ విడుదల చేసి 25 వరకు నామినేషన్ స్వీకరణకు తుది గడువు కాగా, 26న పరిశీలన, 29న ఉపసంహరణ పూర్తి చేసి మే 13న పోలింగ్, జూన్ 4 కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్టు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ క్రమంలో ఏలూరు జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏలూరులో 16.24 లక్షల ఓటర్లు : ఏలూరు పార్లమెంట్ స్థానం పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,743 పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. జనవరి 22న సిద్ధం చేసిన తుది ఓటరు జాబితా ప్రకారం 16,24,416 మంది ఓటర్లను గుర్తించారు. మహిళలు అత్యధికంగా 8,30,390, పురుషులు 7,93,897 మంది ఉన్నారు. అలాగే 129 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు.

'పశ్చిమ'లో 14.61 లక్షల ఓటర్లు

పశ్చిమగోదావరి జిల్లాలో నరసాపురం పార్లమెంట్ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14,61,338 మంది ఓట్లు ఉన్నాయి. మహిళలు అత్యధికంగా 7,44,308, పురుషులు 7,16,956 మంది, థర్డ్ జెండర్స్ 74 మంది ఉన్నారు. మొత్తంగా 1,463 పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఎన్నికల నిర్వహణకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏలూరు జిల్లా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
ఉంగుటూరు	1,01,152	1,04,177	5	2,05,,334
దెందులూరు	1,08,465	1,14,305	7	2,22,777
ఏలూరు	1,10,254	1,20,423	47	2,30,724
పోలవరం	1,22,201	1,30,380	11	2,52,592
చింతలపూడి	1,33,747	1,37,714	41	2,71,502
నూజివీడు	1,17,398	1,19,730	11	2,37,139
కైకలూరు	1,00,680	1,03,661	7	2,04,348
మొత్తం	7,93,897	8,30,390	129	16,24,416

పశ్చిమగోదావరి జిల్లా ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	మొత్తం
ఆచంట	88,319	90,348	1	1,78,668
పాలకొల్లు	95,079	98,293	7	1,93,379
నరసాపురం	83,745	84,442	-	1,68,187
భీమవరం	1,22,228	1,29,023	50	2,51,301
ఉండి	1,03,414	1,13,583	2	2,22,999
తణుకు	1,13,780	1,19,296	6	2,33,082
తాడేపల్లిగూడెం	1,04,391	1,09,323	8	2,13,722
మొత్తం	7,16,956	7,44,308	74	14,61,338

'పశ్చిమ'లో పటిష్టంగా నియమావళి

భీమవరం (ప్రకాశంచౌక్): భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఎన్నికల నియామవళి అమలులో ఉంటుందని, రాజకీయ పార్టీల ప్రచార బ్యానర్స్, కటౌట్లు, వాల్‌పోస్టర్లు, ఫొటోల తొలగింపు, రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలను వస్త్రం కప్పి ఉంచడం తదితర పనులన్నింటినీ నిర్ణీత గడువులోపు అధికారులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గడువు అనంతరం ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

ఉద్యోగులు ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు మద్దతుగా పనిచేస్తున్నట్టు తెలిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ హెచ్చరించారు. శనివారం భీమవరం కలెక్టరేట్‌లో భీమవరం, నరసాపురం, ఉండి నియోజకవర్గాల ఆర్వోలు, ఎంపీడీఓలు, ఎన్నికల బృందాలకు ఐటీ యాప్స్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్భయంగా ఎన్నికల విధులు నిర్వహించాలని ఉద్బోధించారు. ప్రలోభాలను సమర్థవంతంగా ఎదుర్కోవాలని, నగదు, గిఫ్టులు, గ్యాస్ స్టౌలు, గ్యాస్ బండలు, లిక్కర్, బెడ్‌షీట్స్ తదితరాల పంపిణీని అడ్డుకోవాలన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తాయని, వారు ఎలాంటి అలసత్వం వహించకూడదన్నారు. ఫిర్యాదులు అందితే వెంటనే విచారణ చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టంగా ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

క్లుప్తంగా

టీడీపీని ఓడించి తీరుతా



గోపవరంలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు

ముసునూరు: రెడ్ బుక్‌లోకెక్కిన అవినీతిపరుడు టీడీపీలో చేరతానని కబురు చేయగానే పునీతుడైపోతాడా? అని మాజీ ఎమ్మెల్యే, నూజివీడు టీడీపీ మాజీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు టీడీపీ అధినేతలను ప్రశ్నించారు. గోపవరంలో శనివారం మన నూజివీడు మన ముద్దరబోయిన కార్యక్రమాన్ని నిర్వహించి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేష్ పెనమలూరు నియోజకవర్గంలో ఇసుక మాఫియా రాజ్యమేలుతోందని, ఆ ఎమ్మెల్యే పేరు రెడ్ బుక్కులో ఎక్కించానని ప్రకటించి, కనీసం పార్టీ కండువా కూడా కప్పుకోకుండానే నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రటించడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల టీడీపీ కోసం పనిచేసి 175 నియోజకవర్గాల్లో నూజివీడును పదో స్థానంలో నిలిపినా నయవంచన చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనను మోసగించిన టీడీపీని కచ్చితంగా ఓడించి తీరతానన్నారు. నూజివీడు నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, గెలిపించాలని ఇంటింటికీ తిరిగి ప్రజలను కోరారు.

ఎన్నికల స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ఏలూరు (మెట్రో): జిల్లాలో ఎన్నికల నిర్వహణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా వట్లూరులో ఉన్న సీఆర్ ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ శనివారం పరిశీలించారు. జిల్లాలోని ఒక పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన అసెంబ్లీ కౌంటింగ్ కేంద్రాల బ్లాక్‌లను, బస్సు రూట్‌ను, వాహన పార్కింగ్, పోలింగ్ సామగ్రిని తీసుకునే స్టాల్స్, బ్యాలెట్ బాక్సులు, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంలు, పోస్టల్ బ్యాలెట్స్ కౌంటింగ్ గదులు, ఎన్నికల అబ్జర్వర్ల ప్రత్యేక రూంలు, కౌంటింగ్ కేంద్రానికి ఇన్, అవుట్ మార్గాలు, ఎన్నికల నిర్వహణ అధికారులకు, ఎన్నికల సిబ్బందికి భోజన స్టాల్స్ తదితర గుర్తించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలన చేసి అధికారులకు సూచనలు ఇచ్చారు. కలెక్టర్ వెంట జేసీ లావణ్యవేణి, ఐటీడీఏ పీవో ఎం. సూర్య తేజ, అసిస్టెంట్ కలెక్టర్ శ్రీ పూజ, డీఆర్వో పుష్పమణి, ఆర్డీవోలు ఎన్ఎస్‌కే ఖాజావల్లి, కె.అద్దయ్య, భవాని శంకరి, ఎస్‌డీపీ ఎండీ ముక్కంటి, కె.భాస్కరరావు ఉన్నారు.

విద్యార్థి.. విజయోస్తు

- రేపటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు
- జిల్లాలోని 139 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న 32,355 మంది విద్యార్థులు
- 6 సమస్యాత్మక కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘా



పదో తరగతి పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ప్రతి తరగతి గదిలో గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా ఇప్పటికే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే విద్యార్థులకు తాగునీటి సౌకర్యం, ప్రతి విద్యార్థి బెంచ్‌పై కూర్చునే పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య శిబిరం నిర్వహించనున్నారు. అలాగే పరీక్షలు జరిగే సమయంలో కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేస్తారు. పరీక్షల నిర్వహణకు రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాల సహకారం తీసుకుంటున్నారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాకుండా ఉండాలని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైతే సంబంధిత ఇన్విజిలేటరే బాధ్యత వహించాల్సి ఉంటుందని విద్యాశాఖాధికారులు ఇప్పటికే హెచ్చరించారు. పరీక్షలు ఈనెల 30వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయి. కాగా ఈ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఈ నెల 31న ప్రారంభించి ఏప్రిల్ 8వ తేదీ వరకు కొనసాగిస్తారు. జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఏలూరులోని సెయింట్ గ్జేవియర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారు.

పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నాపత్రాలు

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 32,355 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 24,125 మంది ఉండగా, వారిలో 11,760 మంది బాలురు, 12,365 మంది బాలికలు ఉన్నారు. అలాగే ఒకసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు 8,230 మంది విద్యార్థులుండగా వీరిలో 5వేల మంది బాలురు, 3,230 మంది బాలికలు ఉన్నారు. పరీక్షా పత్రాలను పరీక్షా కేంద్రాలకు సమీపంలోని 31 పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. ఈ ప్రశ్నాపత్రాలను పరీక్ష జరిగే రోజు ఉదయం సంబంధిత ప్రధానోపాధ్యాయులు పోలీస్‌స్టేషన్ల నుంచి తీసుకువెళ్లే ఏర్పాటు చేశారు.

సీసీ కెమెరాల నిఘాలో..

జిల్లాలో పదో తరగతి పరీక్షలు జరిగే కేంద్రాల్లో 6 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా అధికారులు గుర్తించారు. వీటిలో ఉంగుటూరు మండలం కైకరం జెడ్పీ హైస్కూల్, లింగపాలెం మండలం రంగాపురం జెడ్పీ హైస్కూల్, జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం జెడ్పీ హైస్కూల్, మండవల్లి మండలం చింతపాడు జెడ్పీ హైస్కూల్, కలిదిండి మండలం కోరుకొల్లు జెడ్పీ హైస్కూల్, గణపవరం మండలం పిప్పర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. ఈ ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరా పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అలాగే పోలీస్ బందోబస్తు కూడా నిర్వహించనున్నారు.

అధికారుల నియామకం

జిల్లాలో పరీక్షలు నిర్వహించే 139 కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్‌లను, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించారు. అలాగే మరో 24 మందిని అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులను, 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను, సీ కేటగిరీ కేంద్రాలకు పరీక్షా పత్రాలను పంపిణీ చేయడానికి 21 మంది రూట్ ఆఫీసర్లను, ఇతర పరీక్షా కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను పంపిణీ చేయడానికి మరో 12 మంది రూట్ ఆఫీసర్లను, 12 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లను, 1,520 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పరీక్షల షెడ్యూల్ ఇలా..

18న ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్–ఎ ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్–1 (కాంపోజిట్ కోర్సు), 19న సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష, 20న ఇంగ్లీష్ పరీక్ష జరుగుతుంది. 22న గణితం, 23న భౌతిక శాస్త్రం, 26న బయోలాజికల్ సైన్స్, 27న సాంఘికశాస్త్రం పరీక్ష జరుగుతుంది. 28న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్–2 (కాంపోజిట్ కోర్సు), ఓల్డ్ ఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్), 30దీన ఓల్డ్ ఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్–2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్), ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు (థియరీ పరీక్షలు) జరుగుతాయి.

పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలి



జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. పరీక్షలకు వచ్చే విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లు, ఇతర గుర్తింపు కార్డులు వెంట తెచ్చుకోవాలి. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలి. పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించం. విద్యార్థులు తమ పాఠశాలకు సంబంధించిన యూనిఫారం ధరించి పరీక్షకు హాజరుకాకూడదు. పరీక్షలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. 8121840400 నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

– ఎస్.అబ్రహం, ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి

దూరవిద్య ఇంటర్, టెన్త్ పరీక్షలకూ ఏర్పాట్లు

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన పరీక్షలను కూడా ఈ నెల 18వ తేదీ నుంచే నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయి. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు 9 కేంద్రాలను సిద్ధం చేశారు. వీటిలో సీఆర్ రెడ్డి జూనియర్ కళాశాలలో ఏ, బీ కేంద్రాలు, శాంతి నగర్‌లోని శ్రీ చైతన్య స్కూల్, కోటదిబ్బ జిల్లా జైలు, ఎస్‌పీడీబీటీ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, జంగారెడ్డిగూడెంలోని ఎస్‌డీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, నూజివీడులోని శ్రీ విస్డమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, నూజివీడు శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఉన్నాయి. అలాగే పదో తరగతి పరీక్షలు దుగ్గిరాల డీ పాల్ జూనియర్ కళాశాల, ఏలూరు ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల, సత్రంపాడు శ్రీభారతి జూనియర్ కళాశాల, ఏలూరు జిల్లా జైలు, జంగారెడ్డిగూడెం త్రివేణి జూనియర్ కళాశాల, నూజివీడు రవీంద్రభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో పదో తరగతి విద్యార్థులు 1161 మంది, ఇంటర్మీడియట్ విద్యార్థులు 1,696 మంది పరీక్షలు రాయనున్నారు. పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు 16 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను, 16 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులను, 138 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ పరీక్షల మూల్యాంకనం ఏప్రిల్ 9 నుంచి 13వ తేదీ వరకు జరగనుంది.

కిస్మిస్ పండ్ల వ్యాన్ బోల్తా



వ్యాన్ నుంచి కిందపడిపోయిన కిస్మిస్ పండ్లు, ట్రేలు

కొయ్యలగూడెం: కిస్మిస్ పండ్లతో వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి రాజమండ్రికి కిస్మిస్ పండ్ల లోడుతో బయలుదేరిన కొయ్యలగూడెంలో సమీపంలోని పులివాగు సమీపంలోకి వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బాక్సులలో ఉన్న కిస్మిస్ పండ్లు రహదారిపై చిందరవందరగా పడిపోయాయి. దీంతో ఆ రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు తలా ఒక బాక్స్, మరికొందరు ఏకంగా బాక్సులు నెత్తిన పెట్టుకుని పట్టుకువెళ్లిపోయారు. ఈ ఘటనలో సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని వ్యాపారి వాపోయాడు. ట్రక్కులో సుమారు నాలుగు వందలకుపైగా పళ్ళ బాక్సులు ఉన్నట్లు తెలిపారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

కట్టుదిట్టంగా ఎన్నికల నియమావళి అమలు

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): ఎన్నికల ప్రకటన వెలువడిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వివిధ శాఖల అధికారులతో జేసీ బి.లావణ్యవేణితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఏమైనా ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాజకీయ పక్షాల ప్రతినిధుల ఫొటోలు ముద్రించి ఉన్న పోస్టర్లను, ఫొటోలను వాల్ రైటింగ్‌లను తదితరాలను తొలగించినట్లు ఆదివారం సాయంత్రానికల్లా తహసీల్దార్లు, ఎంపీడీవోలు ధ్రువీకరణ పత్రం సమర్పించాలని ఆదేశించారు. రానున్న 24 గంటల్లో ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు మొదలైనవన్నీ తొలగించాలని ఆదేశించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రైల్వే వంతెనలు, రోడ్‌వేలు, ప్రభుత్వ బస్సులపై అన్ని అనధికార రాజకీయ ప్రకటనలను ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి 48 గంటలలోపు తొలగించాలన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో అన్ని ప్రకటనలు ఎన్నికల ప్రకటన తర్వాత వెంటనే నిలిపివేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లలో రాజకీయ నాయకులు, మంత్రులు, రాజకీయ పార్టీలకు సంబంధించిన అన్ని సూచనలు, ఫొటోలు ఎన్నికల ప్రకటన వెలువడిన వెంటనే తొలగించాలన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర రాజకీయ కార్యకర్తలతో సహా ప్రభుత్వ భవనాలపై రాజకీయ కార్యకర్తల ఛాయాచిత్రాలు, చిత్రాలు తొలగించాలన్నారు. మోడల్ ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిన తర్వాత రూపొందించబడే విద్యుత్ బిల్లులు, నీటి బిల్లులు, బోర్డింగ్ పాస్‌లు, టీకా సర్టిఫికెట్లు మొదలైన వాటిలో రాజకీయ కార్యకర్తలు/పార్టీల ఫొటోలు లేదా సందేశాలు/చిహ్నాలు ఉండరాదని స్పష్టం చేశారు. ఏదైనా సజీవ రాజకీయ కార్యకర్త లేదా పార్టీ సాధించిన విజయాలను ప్రదర్శించడానికి, అతని పేరు లేదా ఫొటో లేదా పార్టీ చిహ్నాన్ని కలిగి ఉన్న అన్ని హోర్డింగ్‌లు, ప్రభుత్వ ఖజానా ఖర్చుతో కూడిన ప్రకటనల్లో వెంటనే తీసివేయాలన్నారు. ఎన్నికల పర్యటనలలో మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాలలో వసతి కల్పించరాదన్నారు. ఎంపీ ల్యాడ్స్, శాసనసభ్యుల నిధులు లేదా ఇతర ప్రభుత్వ పథకాల కింద నిధులు సమకూర్చిన నీటి ట్యాంకులు, అంబులెన్స్‌లు మొదలైన మొబైల్ వస్తువులపై పార్లమెంట్ సభ్యులు, శాసనసభ్యుల ఫొటోలు ఉంటే వాటిని మూసిఉంచాలన్నారు. ప్రభుత్వోద్యోగి ప్రవర్తన నిష్పక్షపాతంగా ఉండాలని, ఏదైనా పార్టీకి లేదా అభ్యర్థికి అనుకూలంగా వ్యవహరించేందుకు ఎంతమాత్రం వీలులేదన్నారు. ఎన్నికల ప్రచారంలో, రాజకీయ పార్టీ కార్యక్రమంలో పాల్గొనరాదని, ఇటువంటి చర్యలకు పాల్పడితే ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టి.శ్రీపూజ, డీఆర్‌ఓ డి.పుష్పమణి, పాల్గొన్నారు. వివిధ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన ఎన్ఎస్ కె.ఖాజావలి, కె. అద్దయ్య, వై.భవానీశంకరి, ఎం.ముక్కంటి, ఎంసీసీ నోడల్ అధికారి జెడ్పీ సీఈఓ కేఎస్ ఎస్ సుబ్బారావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నాయకర్‌కు టికెట్‌పై సమాచారం లేదు


కొత్తపల్లి ప్రకటనతో జనసేనలో గందరగోళం



మోటార్‌సైకిల్ ర్యాలీ చేస్తున్న మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు

నరసాపురం: నరసాపురం జనసేన టికెట్ బొమ్మిడి నాయకర్‌కు కేటాయించినట్టుగా తనకు సమాచారం లేదని మాజీ మంత్రి, ఇటీవల జనసేనలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. శనివారం సాయంత్రం కొత్తపల్లి తన అనుచరులతో కలిసి రుస్తుంబాదలోని తన నివాసం నుంచి పట్టణంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టికెట్ ఎవరికైనా కేటాయిస్తే పార్టీలో నాయకులకు సమాచారం ఉంటుంది కదా అని ప్రశ్నించారు. చిలకలూరిపేటలో ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, తమ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌లు నిర్వహించనున్న సభకు సంఘీభావంగా తాను ర్యాలీ చేశానని చెప్పిన ఆయన నరసాపురం టికెట్ కేటాయింపుపై ఇచ్చిన ట్విస్ట్ జనసేన వర్గాల్లో చర్చనీయాంశమైంది. మరోవైపు మూడు రోజుల క్రితం బొమ్మిడి నాయకర్ తనకు టికెట్ కేటాయిస్తూ పవన్‌కల్యాణ్ లెటర్ ఇచ్చారని ప్రకటించడంతో పాటు ఆ మేరకు ఆయన ప్రచారం కూడా చేసుకుంటున్నారు. తాజాగా కొత్తపల్లి ర్యాలీ, టికెట్ కేటాయింపు విషయాన్ని పార్టీ అధికారికంగా ప్రకటించలేదని చెప్పడం జనసేన వర్గాల్లో గందరగోళానికి తెర తీసింది. పైగా కొత్తపల్లి తాను ప్రతి ఎన్నికల్లోనూ పోటీలో ఉన్నానని చెప్పారు. దీంతో ఆయన టికెట్ రాని పక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజునే నరసాపురం జనసేనలో కొత్త తలపోట్లు ప్రారంభమయ్యాయి. రానున్న రోజుల్లో తెర వెనుక జరుగుతున్న టికెట్ రేస్ విభేదాలు రోడ్డెక్కే పరిస్థితి కనిపిస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

చినవెంకన్న క్షేత్రం భక్తజన సంద్రం



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల : చినవెంకన్న దివ్యక్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో సుదూర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పురాజగోపుర ప్రాంతంలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్‌తో పాటు, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ ఆవరణలో పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

ఇంటర్ బ్రిడ్జి కోర్సు పరీక్షలకు జనరల్ విద్యార్థుల గైర్హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ బ్రిడ్జి కోర్సు పరీక్షల్లో భాగంగా శనివారం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు జిల్లాలో ఎంపిక చేసిన 12 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 102 మంది జనరల్ విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఒక్కరు కూడా హాజరు కాలేదు. అలాగే 1674 మంది ఒకేషనల్ విద్యార్థులకు గాను 1235 మంది హాజరు కాగా 541 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగలేదని ప్రశాంతంగా జరిగాయని జిల్లా వృత్తివిద్యా అధికారి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల కన్వీనర్ బీ. ప్రభాకర రావు తెలిపారు.

లోక్ అదాలత్‌లో రాజీతో కేసుల పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న జడ్జి మంగకుమారి

ఏలూరు (టూటౌన్): కోర్టు కేసుల నుంచి విముక్తి పొందటానికి జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు వేదిక అని రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగకుమారి చెప్పారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార భవన్‌లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభంలో భాగంగా ముందుగా కక్షిదారులు, న్యాయవాదులతో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ కోర్టు కేసుల నుంచి విముక్తి పొంది ప్రశాంత జీవనం పొందటానికి కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక అని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా ఏలూరు కోర్టులో జాతీయ లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనుకోకుండా పరిస్థితుల ప్రభావం వల్ల కోర్టు కేసుల్లో ఉండి సంతోషానికి దూరం అవుతున్నారని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఇరు పార్టీలు తమ కేసును జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని కేసుల నుంచి విముక్తి పొందాలని తెలిపారు. దీని వల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగి డబ్బు, సమయం, వృధా కాదని, పట్టింపులకు పోకుండా కేసులను రాజీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తి కేకేవీ బుల్లికృష్ణ, ప్రభుత్వ న్యాయవాది బీజే రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారాం, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎస్ఎంఎం నాగరాజు, దిశ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు తదితరులు లోక్ అదాలత్ గురించి వివరించారు. తొలుత జడ్జి పి.మంగకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. అనంతరం లోక్ అదాలత్‌లో పరిష్కారమైన వాహన ప్రమాద నష్టపరిహారం కింద టాటా ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.10 లక్షల నష్టపరిహారం చెక్కును జడ్జి మంగకుమారి కక్షిదారులకు అందజేశారు. టాటా ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ టి.భాస్కర్, సంబంధించిన స్టాండింగ్ కౌన్సిల్ కేవీఆర్‌కే సుబ్బారావు, పిటీషనర్స్ తరపున బీవీ రంగారావు కేసును రాజీ చేశారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 1,935 కేసుల పరిష్కారం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 1,935 కేసులు రాజీ చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ చెప్పారు. వీటిలో 1,217 క్రిమినల్ కేసులు, 365 సివిల్ కేసులు, 185 ప్రీలిటిగేషన్ ఉన్నాయన్నారు. అలాగే 128 వాహన ప్రమాద కేసులను రాజీ చేసి రూ.21.03 కోట్లు పరిహారంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీలో వగ్వాలకు కీలక పదవి



వగ్వాల అచ్యుతరామారావు

భీమడోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కమిటీ జాయింట్ కార్యదర్శిగా వగ్వాల అచ్యుతరామారావు నియమితులయ్యారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుండుగొలను గ్రామంలోని కాపు సామాజికవర్గానికి చెందిన వగ్వాలకు రాష్ట్ర కమిటీలో కీలక పదవి వరించింది. పార్టీ ఆవిర్భావంలో ఉంగుటూరు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి వగ్వాల తన వంతు కృషి చేశారు. జిల్లా స్టీరింగ్ కమిటీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో కొంత కాలం పార్టీకి దూరంగా ఉన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చొరవతో వగ్వాలకు పార్టీ తగిన గుర్తింపునిస్తూ కీలక పదవిని అప్పగించింది. ఇప్పటికే ఆయన సతీమణి వగ్వాల మీనా కుమారి గుండుగొలనులోని శ్రీవేంకటేశ్వర దేవస్థానం చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు. దీంతో ఆ కుటుంబంలోని వగ్వాల దంపతులిద్దరికి సముచిత పదవులు దక్కాయి. శనివారం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు నిస్తారన్నారు. ఈ పదవి వల్ల తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అత్యధిక మెజార్టీలో గెలుపుపొందడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుకు రుణపడి ఉంటానన్నారు. వగ్వాలకు శనివారం ఎమ్మెల్యే వాసుబాబు, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, సొసైటీ అధ్యక్షుడు నంద్యాల సుబ్బరాజు, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్ సింగ్ అభినందనలు తెలిపారు.